చేరువైన స్పెషలిస్ట్ సేవలు

నాడు పీహెచ్‌సీ అంటే శిథిలావస్థలో ఉండే భవనం, వైద్యుల కొరత, అరకొరగా వైద్య సేవలు, ఏ పరీక్షలు చేయాలన్నా పరికరాలు లేని పరిస్థితి. మందులు నామమాత్రం. సుస్తీ చేస్తే పెద్దాస్పత్రికో లేదా ప్రైవేట్ ఆస్పత్రికో పరుగులు తీయడం..

నేడు అత్యాధునిక వసతులతో మూడు బ్లాకులుగా గాజువాక పీహెచ్‌సీ భవన నిర్మాణం. పూర్తి స్థాయిలో వసతులు, అందుబాటులో వైద్యులు, టెస్టులన్నీ ఇక్కడే. ప్రతీ రోజూ స్పెషలిస్ట్ వైద్య సేవలు. ఏ అనారోగ్యం వచ్చినా పీహెచ్‌సీకి వస్తే చాలు తగ్గుతుందనే భరోసా..



- గాజువాక పీహెచ్‌సీలో పెరిగిన వసతులు
- అందుబాటులో స్పెషలిస్ట్ వైద్యులు
- వైద్యసేవలపై రోగుల హర్షం

గాజువాక పీహెచ్‌సీ ఆధునికీకరణ
నిధులు : రూ. 1.24 కోట్లు



వెయిటింగ్ హాల్‌లో కూర్చున్న రోగులు

గాజువాక: ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందించాలనే మహోన్నత ఆశయంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. సర్కారు వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం కోసం కొత్త పీహెచ్‌సీలను నిర్మించిన ప్రభుత్వం ఇప్పటికే ఉన్న పీహెచ్‌సీలకు సంబంధించిన భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించి, అన్ని రకాల సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగానే నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా గాజువాక పీహెచ్‌సీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని తొలగించి రూ.1.24 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించడంతో పాటు వైద్యులు, సిబ్బంది, ప్రజలకు అవసరమైన వసతులను కల్పించింది. ఇద్దరు వైద్యులుకు గదులు, వెయిటింగ్ హాల్, మందుల గది, స్టాఫ్ రూమ్, ఆపరేషన్ థియేటర్, డెలివరీ గదిని అందుబాటులోకి తెచ్చారు.

ఇవీ సేవలు

- వైద్యులు పరీక్షించిన అనంతరం కోవిడ్ లక్షణాలు కనిపించే వారికి ఉచితంగా పరీక్షలు చేస్తారు. మందులు ఉచితంగా అందజేస్తారు.
- గర్భిణులకు ప్రతీ బుధవారం ఉచిత ఆరోగ్య తనిఖీలు, పిల్లలకు డీపీటీ, పోలియో వ్యాక్సినేషన్, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేస్తారు.
- కుష్ఠు, టీబీ వ్యాధుల నివారణకు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతీ రోజు పరీక్షలను నిర్వహించి నివారణకు మందులు అందిస్తారు.



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సుధాకర్

- హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించేందుకు ఇక్కడ పరీక్ష కేంద్రం ఉంది.
- డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, పల్స్ పోలియో, జాతీయ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలు కూడా ఇక్కడి నుంచి నిర్వహిస్తున్నారు.
- ఆరోగ్య రక్ష పథకం కింద పాఠశాల విద్యార్థులకు ప్రతీ గురువారం ఒక్కో పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. పెద్ద కేసులుంటే పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు.
- ప్రతీ శుక్రవారం నివాస ప్రాంతాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తారు.



నేడు: గాజువాక పీహెచ్‌సీ



నాడు: గాజువాక పీహెచ్‌సీ

స్పెషలిస్ట్ డాక్టర్ల ఓపీ

సోమవారం	:	జనరల్ మెడిసిన్
మంగళవారం	:	ఈఎన్‌టీ
బుధవారం	:	గైనిక్
గురువారం	:	ఆర్థోపెడిక్
శుక్రవారం	:	చిల్డ్రన్
శనివారం	:	స్కిన్, డెంటల్
నెలలో మొదటి మంగళవారం	:	మానసిక వైద్యం (సైకియాట్రీ)
ప్రతీ రోజు	:	ఆప్తమాలజీ (కంటి వైద్యం)



మందులు ఇస్తున్న ఫార్మసిస్టు

చేపట్టిన పనులు

- మూడు బ్లాకులుగా భవన నిర్మాణం
- ఇద్దరు వైద్యులకు వేర్వేరు గదులు
- పేషెంట్ వెయిటింగ్ హాల్
- మందుల గది
- స్టాఫ్ రూమ్
- ఆపరేషన్ థియేటర్
- డెలివరీ గది



గాజువాక పీహెచ్‌సీ లోపలిభాగం

కంటి పరీక్షల కోసం వచ్చాను



కొద్దిరోజులుగా కళ్ల మంటలు వస్తున్నాయి. పీహెచ్‌సీలో నిపుణులు అందుబాటులో ఉన్నారని తెలుసుకుని వచ్చాను. కంటి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. దూరంగా ఎక్కడికో వెళ్లే పని లేకుండా, వైద్య నిపుణులు అందుబాటులోనే ఉన్నారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. పైసా ఖర్చు లేకుండా వైద్యం జరిగింది.
– వై.శివ, చినగంట్యాడ

డాక్టర్ చాలా బాగా చూశారు



రెండు రోజుల నుంచి జ్వరం ఎక్కువగా వస్తోంది. పీహెచ్‌సీలో డాక్టర్ చూసి రక్త పరీక్షలు కూడా చేయించారు. ఉచితంగా మందులు ఇచ్చారు. డాక్టర్ చాలా బాగా చూశారు. ఇక్కడ రోగులకు సౌకర్యాలు కూడా బాగున్నాయి. మంచి వైద్యం పొందానని ఆనందంగా ఉంది. – పి.పద్మావతి, కర్ణవానిపాలెం

పీహెచ్‌సీని ఎంతో మార్పు చేశారు



ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉండటంతో డాక్టర్‌కు చూపించుకోవడం కోసం పీహెచ్‌సీకి వచ్చాను. వచ్చిన వెంటనే డాక్టర్ పరీక్షించి అవసరమైన అన్ని మందులు ఇచ్చారు. ఆస్పత్రిని కూడా ఎంతో మార్పు చేశారు. సౌకర్యాలు బాగున్నాయి. కూర్చునేందుకు సౌకర్యవంతంగా ఉంది. పరీక్షలు కూడా ఇక్కడే చేస్తున్నారు. – కె.లక్ష్మి, గాజువాక

మంచి వైద్యం అందుతోంది



నేను గొంతు నొప్పితో బాధ పడుతున్నాను. గుటక వేయాలన్నా, మాట్లాడాలన్నా ఇబ్బందిగా ఉంది. డాక్టర్ చూసి మందులిచ్చారు. డాక్టర్లు కూడా చాలా శ్రద్ధగా నా సమస్యను విన్నారు. పరీక్షించి, మందులు రాశారు. తగ్గిపోతుందని చెప్పారు. ఇక్కడ మంచి వైద్యం అందుతోంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – ఎం.ఎ.కె.జిలాని, గాజువాక

క్లుప్తంగా

విజ్ఞాన్‌లో క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీల విజేత జట్టుతో నిర్వాహకులు

అగనంపూడి: వచ్చేనెలలో నిర్వహించనున్న విజ్ఞాన్ యువతరంగ్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అంతర్ కళాశాల క్రీడా పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ టి.మధుసూదనరావు, విశ్వనాథ శర్మ, పి.వి.రమణ, రాంబాబు పాల్గొన్నారు.

'సర్వహిత' వితరణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న పిళ్లా శ్రీనివాసరావు

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పిళ్లా శ్రీనివాసరావు తన భార్య వర్ధంతి సందర్భంగా పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాలుగు వాటర్ క్యాన్లు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. ఆమె జ్ఞాపకార్థం శ్రీనివాసరావు ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఎం.మస్తాన్‌రెడ్డి, కిడిమి హనుమంతురావు, బలిరెడ్డి సత్యనారాయణ, గుదే సుశీలా గజేంద్రరావు, పాఠశాల హెచ్‌ఎం వై.భీమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టేజి నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి, పూర్ణ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించనున్న స్టేజి పనులకు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానంద శర్మ (పూర్ణ) గురువారం శంకుస్థాపన చేశారు. దాత డాక్టర్ ఎం.దుర్గాప్రసాద్ అందించిన లక్ష రూపాయల విరాళంతో స్టేజీ నిర్మిస్తున్నామన్నారు. దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



రాంనగర్‌లో మొక్క నాటుతున్న జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను చేపట్టి, పచ్చదనాన్ని పెంపొందించాలని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. ఎకో వైజాగ్‌లో భాగంగా 68వ వార్డు రాంనగర్ పీహెచ్‌సీ వద్ద గురువారం ఆయన మొక్కలు నాటారు. జెడ్సీ మాట్లాడుతూ హార్టికల్చర్, జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నామని చెప్పారు. మిండి శ్మశాన వాటిక, రాంనగర్ పీహెచ్‌సీ మార్గంలో రోడ్డు పక్కన మొక్కలు నాటి, ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. వార్డు పరిధిలో 100 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాదరావు, హార్టికల్చర్ హెచ్‌వో పల్లవి, వైఎస్సార్ సీపీ నాయకులు సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్ పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు లాంగ్ సర్వీస్ అవార్డులు



ఉద్యోగికి అవార్డు అందిస్తున్న విభాగాధిపతి దుర్గాప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం ఉద్యోగులకు గురువారం లాంగ్ సర్వీసు అవార్డులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విభాగం సీనియర్ మేనేజర్ బి.రాజశేఖర్, సీనియర్ ఫోర్‌మన్ డి.రాజశేఖర్‌లకు విభాగాధిపతి ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్ చేతుల మీదుగా 150 గ్రాముల సిల్వర్ కాయిన్, సర్వీసు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఇంటక్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ తమ యూనియన్ హయాంలో ప్రవేశపెట్టిన గోల్డ్ కాయిన్, సిల్వర్ కాయిన్లను యాజమాన్యం నిలిపి వేయడం తగదన్నారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు టి.కనకరాజు, సిటూ నాయకులు కె.సిహెచ్.నాయుడు, జీఎంలు బి.టి.నాయక్, ఎస్.కె.రౌత్ పాల్గొన్నారు.

ఘనంగా చందు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఉరుకూటి చందు

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, వార్డుల నుంచి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాతగాజువాకలోని ఆయన నివాసానికి వచ్చి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలు సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆయన్ను గజమాలలతో సత్కరించి సంబరాలు నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, నాయకులు మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, మాటూరి శ్రీనివాసరావు, సిరట్ల శ్రీనివాస్, మహాలక్ష్మినాయుడు, యువశ్రీ, అండిబోయిన లక్ష్మి, ప్రమీల, రాజేష్ తదితరులున్నారు.

ఆలయానికి చేరిన అయోధ్య రాముడి అక్షింతలు



ఆలయాలకు అక్షింతలు అందజేసే కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్‌పీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: అయోధ్య రాముడి పవిత్ర అక్షింతలు రామాలయాలకు చేరాయి. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు, స్థానిక నాయకులతో కలిసి 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో రామాలయానికి వాటిని అందించారు. మహిళల కోలాటంతో ఆలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. జనవరి 1వ తేదీ నుంచి అక్షింతలను ప్రతీ ఇంటికి అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్పలరాజు, అప్పారావు, సూరిబాబు, గోవింద్, కామాడ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సంగ్రాన నూకరాజు, గొంతిన సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ద్రోణంరాజు సత్యనారాయణ సేవలు ఎనలేనివి



ద్రోణంరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎంతోమంది రాజకీయ నాయకులను తయారు చేసి, రాజకీయ గురువుగా పేరుగాంచిన ద్రోణంరాజు సత్యనారాయణ సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ద్రోణంరాజు సత్యనారాయణ వర్ధంతిని బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ద్రోణంరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మార్డుపూడి పరదేశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీనివాసరావు, గంట్యాడ గురుమూర్తి, వై.మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

30న రక్తదాన శిబిరం



రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రక్తదానంపై అవగాహన కలిస్తూ నెల్లిముక్కు, మొల్లివానిపాలెం, గొందేశివీధి, ధర్మాలవీధి తదితర ప్రాంతాల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, స్కౌట్ మాస్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

'ఆడుదాం ఆంధ్రా'కు విశేష స్పందన



ఆదర్శగ్రౌండ్‌లో మహిళల వాలీబాల్ పోటీలు



నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఖోఖో ఆడుతున్న యువతులు



ఆదర్శగ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



భెల్ మైదానంలో క్రికెట్ పోటీలు

పెదగంట్యాడ: ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలంలో మూడో రోజు గురువారం ఉత్సాహంగా సాగాయి. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో, ఇండోర్ స్టేడియంలో, ఆదర్శ గ్రౌండ్‌లో ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన లభించింది.

- పెదగంట్యాడ సచివాలయం–2 పరిధిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పెదగంట్యాడ–2 సచివాలయం పరిధి నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఖోఖో, క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆదర్శగ్రౌండ్‌లో క్రికెట్, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఇండోర్ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పెదగంట్యాడ మండల పరిధిలో నిర్వహించిన పలు పోటీల్లో 46 జట్లు పాల్గొన్నాయని జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు.
- 87వ వార్డు పరిధిలోని ఎరుకల వీధి, గణేష్ నగర్ సచివాలయ పరిధిలో క్రీడాకారులు ఆదర్శ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు ప్రారంభించారు.

భెల్ క్రీడా మైదానంలో..

అక్కిరెడ్డిపాలెం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా భెల్ క్రీడా మైదానంలో గురువారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్సీ సింహాచలం మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని, గెలుపు, ఓటములను సమంగా స్వీకరించాలని సూచించారు. నాతయ్యపాలెం సచివాలయం–2 నుంచి 4 క్రికెట్ జట్లు, కాపు జగ్గరాజుపేట సచివాలయం నుంచి 4 టీంలు, నాతయ్యపాలెం సచివాలయం–1 నుంచి 2 టీమ్‌లు, కాపుతుంగ్లాం సచివాలయం నుంచి 3 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. 6 మ్యాచ్‌లను నిర్వహించినట్లు పీడీ డి.సత్యకుమార్ తెలిపారు. ఆయా సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

శరణు శరణు దుర్గమ్మా..



అగ్నిగుండం తొక్కుతున్న భవానీ మాలధారులు

పెదగంట్యాడ: నడుపూరు పైడిమాంబ ఆలయంలో దుర్గమ్మ శరణు ఘోష మిన్నంటింది. సుమారు 400 మంది భవానీ మాలధారులు దుర్గమ్మకు గురువారం సాయంత్రం విశేష పూజలు చేశారు. పైడిమాంబ శక్తిపీఠం గురుస్వామి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలకు శెట్టిబలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు చెల్లిబోయిన నాయుడు హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భవానీ మాలధారులు అగ్నిగుండం తొక్కారు. కార్యక్రమంలో పి.నాగరాజు, పితాని భాస్కరరావు, మునగపాక అచ్చింనాయుడు, ఇందల సంతోష్, గొంప రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

1050వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అన్నింటినీ ఎదుర్కొంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1050వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాయంత్రం వేళల్లోను రైతుబజారులో విక్రయాలు

నేటి నుంచి అమలు



రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గాజువాక: గాజువాక మహిళా రైతు బజారులో శుక్రవారం నుంచి సాయంత్రం వేళల్లోను అమ్మకాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ నుంచి ఆదేశాలు వెలువడినట్లు రైతు బజారు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరిణి తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ ఉదయం పూట మాత్రమే అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు విక్రయాలు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. జిల్లాలోని 13 రైతు బజార్లలో 1826 మంది రైతుల భూమి, పంటల వివరాలపై సర్వే చేసిన అధికారులు 161 మందిని అనర్హులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. మిగిలిన 1665 మంది రైతులను మొత్తం రైతు బజార్లలోని 1072 స్టాల్స్‌లో సర్దుబాటు చేయాల్సి ఉంది. సర్దుబాటు అనంతరం 593 మంది రైతులకు స్టాల్స్ సరిపోకపోవడంతో గాజువాక, నర్సింహనగర్, మధురవాడ రైతు బజార్లలో సాయంత్రం వేళల్లో కూడా అమ్మకాలను ప్రారంభించి వాటిలో రైతులను సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఈ మూడు రైతు బజార్లలో శుక్రవారం నుంచి సాయంత్రం వేళల్లో అమ్మకాలను అందుబాటులోకి తెస్తూ జేసీ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఆరు రైతు బజార్లలో ఇప్పటికే సాయంత్రం వేళల్లో అమ్మకాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

త్రిఫ్ట్ సొసైటీ ఐడీ కార్డ్ హోల్డర్, ట్యాగ్‌ల విడుదల

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ మరింత అభివృద్ధి చెందాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఆకాంక్షించారు. ఈ ఏడాది త్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ఇవ్వనున్న ఐడెంటిటీ కార్డు హోల్డర్, ట్యాగ్‌లను వారు విడుదల చేశారు. ఉక్కు త్రిఫ్ట్ సొసైటీ సేవలు మరింత విస్తృతం చేసేలా సొసైటీ పాలకవర్గం కృషి చేయాలన్నారు. ఇందుకు ఉద్యోగులు సహకారం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్, కార్యదర్శి రామచంద్రమూర్తి, కోశాధికారి కొండరాజు, డైరెక్టర్లు కె.శ్రీనివాస్, ఎం.వి.రమణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగికి బంగారు పతకం



భాస్కరరావు

పెదగంట్యాడ: కావలిలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగి ఎం.భాస్కరరావు ప్రతిభ కనబరిచారు. 55 ప్లస్ విభాగంలో షాట్‌పుట్‌లో ఆరు కిలోల గుండును 9.35 మీటర్లు విసిరి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో భాస్కరరావు ఈ ఘనత సాధించారు. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముంబయిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెదగంట్యాడకు చెందిన ఆయన విశాఖ ఉక్కులోని నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్నారు. భాస్కరరావును ఉక్కు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు అభినందించారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

గాజువాక: పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు గురువారం ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు చెవుల్లో పూలు పెట్టుకొని గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, గొల్ల రాము తదితరులు పాల్గొన్నారు.